సాక్షి
జగిత్యాల

గురువారం । 19 । జనవరి । 2023



ఘనంగా ఏకాదశి వేడుకలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.



జల్సాల కోసమే దొంగతనాలు

మల్లాపూర్: ఓ బాలుడితోపాటు మరో చైన్‌స్నాచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి పూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శిక్షణ, ఎంపిక

జగిత్యాలటౌన్: విదేశీ ఉద్యోగ నియామకాల కోసం టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక నర్సింగ్ కళాశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ బుధవారం తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్టు చేసట్టామన్నారు. 22 – 35ఏళ్ల వయస్సు కలిగిన బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు అర్హులని వివరించారు. అభ్యర్థులకు వృత్తిపరమైన ముందస్తు పనిఅనుభవం అవసరం లేదని తెలిపారు. స్క్రీనింగ్ టెస్టులో ఎంపికైన వారికి జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పనిచేయడానికి అవసరమైన అదనపు వృత్తిపర నైపుణ్యాలు అందిస్తారని వివరించారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి నెలకు రూ.1.20లక్షల – 1.50లక్షల వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వివరాలకు 91007 98204, 99088 30438 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉద్యోగావకాశాలు

మల్యాల(చొప్పదండి): నూకపల్లి ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో పనిచేసేందుకు ఏఎన్‌ఎం, హెడ్‌కుక్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఐత శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఏఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసి, 18– 45ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. హెడ్‌కుక్‌గా పనిచేసేందుకు ఏడో తరగతి ఉత్తీర్ణులై, 18– 45 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులని ఆయన వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు(మహిళలు) ఈనెల 19 – 21వ తేదీలోగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ప్రత్యేకాధికారికి దరఖాస్తులు అందజేయాలని ఎంఈవో సూచించారు.

ఆధార్‌తో అనుసంధానించాలి



రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

మల్యాల(చొప్పదండి): ఉపాధిహామీ కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తిచేయాలని డీఆర్డీవో పీడీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయనసందర్శించారు. ఉపాధిహామీ రికార్డులు తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరి ఆధార్‌కార్డు అనుసంధానం ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో వాసవి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపై ఆక్టోపస్ మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ ఆపరేషన్‌లో ఆక్టోపస్ సిబ్బంది

మల్యాల(చొప్పదండి): ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో తీవ్రవాదులు దాడిచేసి భక్తులను అదుపులోకి తీసుకుంటే.. వారిని కాపాడేందుకు తక్షణ స్పందన ఎలా ఉండాలనే దానిపై ఆక్టోపస్ సిబ్బంది బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సాహసాలు కళ్లకు కట్టాయి. సింధూశర్మ, డీఎస్పీ ప్రకాశ్ పర్యవేక్షణలో ఆక్టోపస్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో 60మంది సిబ్బంది, స్థానిక ప్రత్యేక పోలీసులు సిబ్బంది మరో 60మందితో కౌంటర్ ఆపరేషన్ నిర్వహించారు. ఆక్టోపస్ సిబ్బంది స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వడం.. వారిసహకారంతో తీవ్రవాదులపై ఎదురుదాడి చేయడం, ఆలయ ప్రధాన ద్వారం, పరిసరాల్లో 120మంది సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి ఆలయంలో లోపల దాగిఉన్న 10మంది తీవ్రవాదులను మట్టుబెట్టి, భక్తులను కాపాడినట్లుగా మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో మల్యాల ఎస్సై చిరంజీవి, మండల వైద్యాధికారి రవిశంకర్, జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు విడుదల చేయండి

జగిత్యాల: పీఆర్సీ బకాయిలను మంజూరు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి కోరారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీల్లో 317 మంది బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. నిలిపి ఉంచిన 13 జిల్లాల స్పౌజ్ కేసులను పరిష్కరించాలన్నారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు. మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.కోట్లు కొల్లగొడుతున్నారు..

- కోరుట్లకు చెందిన ఫైనాన్స్, వడ్డీ వ్యాపారి బాస రాజగంగారామ్ పలువురి నుంచి రూ.15కోట్లు – రూ.20కోట్ల వరకు అప్పు తీసుకున్నాడు. మూడో కంటికి కనిపించకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆర్నెల్ల క్రితం పారిపోయాడు. బాధితులెవరూ ఇప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.



- పత్తాలేకుండా పారిపోతున్నారు..
- రుణగ్రహీతల మాయాజాలం
- ఐపీ దాఖలు చేస్తున్న ఆర్థిక నేరస్తులు
- లబోదిబోమంటున్న బాధితులు

జగిత్యాలక్రైం: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒకప్పుడు ఫైనాన్స్ కంపెనీలు, చిట్టీల లావాదేవీలు పెద్దఎత్తున జరిగాయి. సామాన్యుల నుంచి బడా వ్యాపారుల వరకూ అందరి అవసరాలు తీర్చుతూ లాభదాయక వ్యాపారాలు నిర్వహించాయి. ఆ తర్వాత ధనార్జనే ధ్యేయంగా పనిచేశాయి. చిట్టీలు వేసిన వారికి పైసా ఇవ్వకుండా వేధించాయి. ఇదేమిటని ప్రశ్నించిన వారిని కోర్టు మెట్లెక్కించి నానా రభస చేశాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఇలాంటి ఫైనాన్స్‌లు, చిట్టీల పనిపట్టారు. అక్కడితో కొంతకాలం ఆర్థిక నేరాలు కొద్దిగా తగ్గుముఖం పట్టాయి.

ఇప్పుడు పెరుగుతున్నాయి..

జిల్లాలోని కొందరు మహిళలు అవసరమైన వారికి, తమకు తెలిసిన, సమీప బంధువులకు అప్పు ఇస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించిన వ్యాపారులు అధిక వడ్డీ ఇస్తామని చెబుతూ అప్పు తీసుకుంటున్నారు. కొంతకాలం క్రమం తప్పకుండా సొమ్ము ముట్టజెబుతున్నారు. ఆ తర్వాత రూ.లక్షలు తీసుకుని కనిపించకుండా పోతున్నారు. తాము మోసపోయామని భర్తకు చెప్పలేక, ఉన్నదంతా కోల్పోయిన మహిళలు తమలో తామే కుమిలిపోతున్నారు.

చిట్టీల పేరిట ఘరానా మోసం..

- కొందరు వ్యాపారులు అనుమతి లేకుండా రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు చిట్టీలు నడిపిస్తున్నారు. అయితే, క్రమం తప్పకుండా చిట్టీ కట్టిన వారికి గడువు ముగిసినా కొందరు డబ్బులు ఇవ్వడంలేదు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు ఒత్తిడి తేవడంతో సరంజామా సర్దుకుని పత్తాలేకుండా పారిపోతున్నారు.

జిల్లాలో చోటుచేసుకున్న మరిన్ని మోసాలు..

- జగిత్యాల సమీపంలోని గోవిందుపల్లికి చెందిన గాండ్ల వెంకన్న పలువురి వద్ద రూ.4కోట్లు – రూ.5కోట్ల అప్పు చేశాడు. నెల క్రితం ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. బాధితులు లబోదిబోమంటున్నారు.
- జగిత్యాల రూరల్ మండలం మోరపల్లికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సుమారు రూ.కోటి వరకు అప్పు చేశాడు. ఆర్నెల్ల క్రితం ఐపీ నోటీసులు పంపించాడు.
- కోరుట్లకు చెందిన రిక్షావాలా ఒకరు అధిక వడ్డీ ఇస్తానని పలువురు పట్టణ వాసుల నుంచి రూ.2కోట్ల వరకు అప్పు తీసుకున్నాడు. ఏడు నెలల క్రితం చిరునామా లేకుండా పారిపోయాడు.
- మల్లాపూర్ మండలం ధామ్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి పలువురి వద్ద రూ.కోటి వరకు అప్పు చేశాడు. ఏడాది క్రితం ఐపీ దాఖలు చేశాడు.
- ఇలా చెప్పుకుంటూ పోతే ఎగవేతదారుల జాబితా భారీగానే ఉంటుంది.

సామాన్యులే మోసపోతున్నారు

వ్యాపారులను నమ్మి చాలామంది సామాన్యులు అప్పులు ఇస్తున్నారు. అనుమతి లేని వ్యాపారులు ఆ తర్వాత రూ.కోట్లతో కనిపించకుండా పోతున్నారు. కొందరు ఐపీ పెడుతున్నారు. ఇలాంటి వారితో సామాన్యులే ఆర్థికంగా నష్టపోతున్నారు. అనుమతి ఉన్న కంపెనీలు, బ్యాంకుల్లోనే డబ్బు పొదుపు చేసుకోవాలి.

– ప్రకాశ్, డీఎస్పీ, జగిత్యాల

వడ్డీ వ్యాపారి అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన వడ్డీ వ్యాపారి రేగొండ నరేశ్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రకాశ్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నరేశ్ జిల్లా కేంద్రంతోపాటు సమీప గ్రామీణుల వద్ద పెద్ద మొత్తంలో అప్పు చేశాడు. అమాయక మహిళల నుంచి మూడున్నర కిలోల బంగారం కూడా సేకరించాడు. ఇందుకోసం అధిక వడ్డీ చెల్లిస్తానని నమ్మించాడు. ఆ తర్వా నామమాత్రపు వడ్డీ చెల్లించాడు. అంతేకాదు.. 2021 అక్టోబర్‌లో కుటుంబంతో కలిసి ఎటోపారిపోయాడు. ఈనెల 16న తన తల్లిని చూసేందుకు జగిత్యాల పోచమ్మవాడలోని తన ఇంటికి రాగా పక్కా సమాచారంతో పట్టణ సీఐ కిశోర్ పట్టుకున్నారు. విచారణ కోసం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈనెల 16న రాత్రి.. ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల కళ్లు గప్పి బ్యాగుతో సహా నరేశ్ పారిపోయాడు. ఈక్రమంలో గాలించగా చిన్నకెనాల్ వద్ద పట్టుపడ్డాడు. నిందితుడి నుంచి 3.350 కేజీల బిస్కెట్, నక్లెస్ బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

ఈ సొమ్మును కోర్టులో డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ కిశోర్, ఎస్సైలు సంజీవ్, రహీం, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కంటి వెలుగు

- రెండోవిడతకు ఏర్పాట్లు పూర్తి

కోరుట్లరూరల్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా నేత్రవైద్య శిబిరాలు నిర్వహిస్తారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తారు.

జనాభా ప్రాతిపదికన పరీక్ష కేంద్రాలు..

- జిల్లాలో 380 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికగా నేత్ర పరీక్ష కేంద్రాలు ఇప్పటికే ఏర్పాటు చేశారు.
- 600 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో రెండు రోజులు, 4 వేల – 5వేల లోపు జనాభా ఉంటే గరిష్టంగా 17 రోజుల పాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తారు.
- జిల్లాలో గరిష్టంగా 17 రోజులపాటు కోరుట్ల మండలం పైడిమడుగులో కంటి వెలుగు పరీక్ష కేంద్రం నిర్వస్తారు.
- ఒక్కో కేంద్రంలో 12 మంది సిబ్బంది సేవలు అందిస్తారు.
- ప్రతీ శిబిరంలో కంటి పరీక్ష కోసం ఏఆర్ యంత్రం సమకూర్చారు.



కంటి పరీక్ష యత్రం

- జిల్లాలోని 46 కేంద్రాల్లో గత మంగళ, బుధవారాల్లో ట్రయల్ రన్ పూర్తిచేశారు.
- జిల్లాలో సుమారు 6.70 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- బుధవారం సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాలో కంటి వెలుగును కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.
- జిల్లా కేంద్రంలో రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.
- ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు ప్రారంభిస్తారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమన్వయంతో కంటి వెలుగును విజయవంతం చేయండి
- కలెక్టర్ రవి

జగిత్యాల: జిల్లాలో గురువారం నుంచి చేపట్టే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రవి సూచించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఇన్‌చార్జి మంత్రి కొప్పుల ఈశ్వర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం జిల్లాలో ప్రారంభించనున్నారని తెలిపారు. కంటి వెలుగుపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని, అవసరమైన వారికి వెంటనే రీడింగ్ అద్దాలు అందించాలన్నారు. దృష్టి లోపం ఉన్నవారికి కావాల్సిన కళ్లద్దాలు పరీక్ష కేంద్రం నుంచి ఆర్డర్ పెట్టి 15రోజుల్లో తెప్పించి ఉచితంగా అందిస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు రోజూ ఉదయం 9 – సాయంత్రం 4 గంటల వరకు చేస్తారని, ఇందుకోసం 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. అదేవిధంగా డీఎంహెచ్‌వో శ్రీధర్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ రవి

సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాలరూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రవి సూచించారు. జగిత్యాల రూరల్ మండలం చెర్లపల్లి గ్రామంలో కంటి వెలుగు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్ని కంటి జబ్బులకు చికిత్స అందించడంతో పాటు ఉచితంగా కళ్లద్దాలు అందిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాధురి, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీడబ్ల్యూవో నరేశ్, తహసీల్దార్ నవీన్, సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

నీటి యాజమాన్యంపై పరిశోధనలు



శిక్షణ పొందిన ఏఈవోలతో వాలంతరీ డైరెక్టర్ జనరల్ రమేశ్ తదితరులు

- 'వాలంతరీ' డైరెక్టర్ జనరల్ రమేశ్

జగిత్యాలఅగ్రికల్చర్: సాగునీటి యాజమాన్యంపై వాలంతరీ ఆధ్వర్యంలో అనేక పరిశోధనలు చేస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ రమేశ్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రైతువేదికలో బుధవారం నేల, సాగు నీటి యాజమాన్యంపై ఏఈవోలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, వరిలో నీటి యాజమాన్యంపై పరిశోధనలు చేసి దిగుబడి పెంచామన్నారు. రసాయన ఎరువులు అధికంగా వినియోగించకుండా నేలను ఎలా రక్షించుకోవాలనే అంశంపైనా శోధించినట్లు చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా భూగర్భజలాలు వృద్ధి చెందాయని, అయితే, సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం ఇచ్చే పంటలు పండించాలని అన్నారు. వాలంతరీ డైరెక్టర్ బి.కృష్ణారావు మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు నూతన విధానాలు అవలంబించాలన్నారు. సాగు నీటిని పొదుపుగా వినియోగిస్తూ, నేలను సారవంతం చేయాలని కోరారు. వాలంతరీ ఇంజినీరింగ్ విభాగం డైరెక్టర్ పీవీ నాగేందర్ మాట్లాడుతూ, రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులు పరిచయం చేయాలన్నారు. సంప్రదాయ పద్ధతులతో ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువగా వచ్చి రైతులకు గిట్టుబాటు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఏఈవోలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్, వాలంతరీ ఇన్‌చార్జి సునీత, టెక్నికల్ ఏడీ కల్పన, ఏవో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడికి రూ.4వేల కోట్లు ధారాదత్తం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): బీఆర్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌కు తెలంగాణ సీఎం కేసీఆర్ రూ.4వేల కోట్ల విలువైన భూమి ధారాదత్తం చేశారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లు వెచ్చించి ఏపీలో బీఆర్‌ఎస్ బాధ్యతలను తోట చంద్రశేఖర్‌కు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. దళితులను మోసం చేస్తూ కేవలం దళితబంధు పేరిట పార్టీ కార్యకర్తలకే రుణాలు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. నిజమైన దళితులకు ఎలాంటి దళితబంధు ఇవ్వలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

రైతుల హక్కులు కాపాడుతాం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

- మాస్టర్ ప్లాన్‌పై ఉద్యమిస్తాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- రైతులను కలిసి మద్దతు ప్రకటించిన నేత

జగిత్యాలరూరల్: మున్సిపాలిటీ అమలు చేసేందుకు నిర్ణయించిన మాస్టర్ ప్లాన్ నుంచి గ్రామాలను తొలగించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల హక్కులు కాపాడేందుకు వారు చేసే ఆందోళనకు తోడుగా ఉంటానని తెలిపారు. ఏటా రెండు పంటలు పండే భూములను మాస్టర్ ప్లాన్ పరిధిలోకి తేవడం ఏమిటని ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్‌తో రైతులు భవిష్యత్‌లో భూహక్కులు కోల్పోతారని, వాటిపై హక్కులు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. 'ముసాయిదా మాస్టర్ ప్లాన్ మీకు తెలియకుండానే జారీ చేశారా? ప్రజలతో చర్చించాల్సిన బాధ్యత మీపై లేదా?' అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం కాదని, జీవోను పూర్తిగా రద్దు చేయాలని, గ్రామాలను అందులోంచి తొలగిస్తూ ఫైనల్ నోటిఫికేషన్ జారీచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు రమ్య, ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, నాయకులు గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, లక్ష్మణ్, మునీందర్‌రెడ్డి, ధర్మయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పన్నపేటను తొలగించాలని విన్నపం

జగిత్యాలటౌన్: మాస్టర్‌ప్లాన్ పరిధి నుంచి తమ గ్రామాన్ని తొలగించేలా చూడాలని తిప్పన్నపేట గ్రామస్తులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడారు. తమ గ్రామాన్ని మాస్టర్ ప్లాన్ పరిధిలోకి తేవడంతో సర్వం కోల్పోయి తామ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసి పట్టణానికే పరిమితం చేసేవరకు రైతులకు అండగా నిలుస్తానని జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అప్పటిదాకా జరిగే పోరాటాలకు వెన్నంటి ఉంటానని ఆయన అభయం ఇచ్చారు.

విద్యార్థులకు పోటీలు

జగిత్యాల: జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, న్యూఢిల్లీ 18వ స్థాపనను పురస్కరించుకుని పాఠశాల, హాస్టల్ విద్యార్థులకు హక్కులపై అవగాహన కోసం పోటీలు నిర్వహించనున్నట్లు డీడబ్ల్యూవో నరేశ్ బుధవారం తెలిపారు. పోటీలు రెండు రకాలుగా ఉంటాయన్నారు. అందులో ఒకటి.. ఒకటి నుంచి ఐదో తరగతి, రెండోది.. ఆరు నుంచి పన్నెండో తరగతి విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 28వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు nspcr వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కంచెలు తొలగించండి



డీఎఫ్‌వో కార్యాలయం ఎదుట దళితులు

జగిత్యాలటౌన్: కథలాపూర్ మండలం చింతకుంట సర్వే నంబర్ 219లోని దళితుల భూముల్లో వేసిన ఫారెస్టు కంచెను తొలగించాలని ఆ గ్రామ దళితులు జిల్లా ఫారెస్టు అధికారికి విన్నవించారు. ఈమేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఫారెస్టు అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామ సర్వేనంబరు 219లోని భూముల్లో జాయింట్ సర్వే నిర్వహించి ఫారెస్టు కంచె తొలగించాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరి పెద్ద గంగారాం, బాలయ్య, లస్మయ్య, ఎర్రయ్య, దమ్మ లస్మయ్య, కాశిపత్రి లస్మయ్య, కొండయ్య, మారంపెల్లి భూమయ్య ఉన్నారు.


ఢిల్లీ వైపు పరుగులు!

- చోరీకి వినియోగించింది నలుపు కారు
- అప్రమత్తమైన నాలుగు రాష్ట్రాల పోలీసులు
- గాలింపు చర్యల్లో జిల్లా పోలీసు బృందాలు
- ముమ్మరంగా ఏటీఎం చోరీ కేసు దర్యాప్తు

కోరుట్ల: పట్టణంలోని ఎస్‌బీఐ తాండ్ర్యాల శాఖ సమీప ఏటీఎంలో చోరీకి యత్నించిన ముఠా నల్లరంగు కారులో ఢిల్లీ వైపు పారిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. దొంగలను పట్టుకోవడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసింది. కారు ఆచూకీ కనిపెట్టేందుకు నాలుగు రాష్ట్రాల పోలీసు అధికారులకు సమాచారం వెళ్లినట్లు తెలిసింది.

నాలుగు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తం..

- ఆదివారం వేకువ జామున కోరుట్లలోని ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నించి విఫలమైన దొంగల ముఠా.. 3911 నంబరు గల నల్లరంగు కారులో ఇప్పటికే నాలుగు రాష్ట్రాల సరిహద్దులు దాటిపోయినట్లుగా సమాచారం.
- జగిత్యాల – నిర్మల్ జిల్లా సరిహద్దుల్లోని సోన్ వంతెన మీదుగా వెళ్లిన దొంగల కారు.. అక్కడి నుంచి ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ చేరుకున్నట్లు సమాచారం.
- అక్కడినుంచి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా ఏరియాల నుంచి ఢిల్లీ వైపు కారు వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం చిక్కినట్లు తెలిసింది.
- ఈ మధ్యలో ఎక్కడెక్కడ టోల్‌ప్లాజాలు ఉన్నాయి? అక్కడ టోల్‌ప్లాజాల్లో సీసీ కెమెరాలు, ఇతరత్రా వివరాల ఆసరాగా కారు నంబరు, దాని ఆధారంగా పూర్తి సమాచారం సేకరిస్తున్నారు.
- కారు నంబరు విషయంలో కొన్ని సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.
- కారు ఢిల్లీ పాసింగ్‌గా చూపుతున్నప్పటికీ సాధారణంగా దొంగలు ఎత్తుకొచ్చిన కార్లను మాత్రమే చోరీలకు వినియోగిస్తారని పోలీసు అధికారులు విశ్లేషిస్తున్నారు.



గాలింపు చర్యలు ముమ్మరం

ఏటీఎం చోరీ నిందితుల ఆచూకీ కనిపెట్టే విషయంలో ఇప్పటికే నాలుగు రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేసిన జిల్లా పోలీసు అధికార యంత్రాంగం.. నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసింది. టోల్ ప్లాజాలు, సీసీ కెమెరాల ఆధారంగా రెండు బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా.. మరో బృందం నాగ్‌పూర్ టు ఢిల్లీ పరిసరాల్లో గాలింపులు చేపట్టినట్లు సమాచారం. చోరీ జరిగి ఇప్పటికే మూడు రోజులు గడిచిపోతున్న క్రమంలో ఏటీఎం చోరీ దొంగల ఆచూకీ కనిపెట్టడం క్లిష్టతరంగా మారుతోంది. అయినప్పటికీ పోలీసులు తమదైన శైలిలో లోతుగా దర్యాప్తు సాగిస్తున్నారు.

క్లుప్తంగా

బడిలో గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి


సునీత (ఫైల్)

మంథని: మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన్నీరు సునీత(37) పాఠశాలలో బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. ఫిజికల్ సైన్స్ బోధించే సునీత పాఠశాలలోని కార్యాలయగదిలో తోటి ఉపాధ్యాయులతో కలిసి కుర్చీలో కూర్చుంది. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అపస్మారకస్థితికి వెళ్లిపోయింది. తోటిసిబ్బంది పరీక్షించి వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరీక్షించగా.. అప్పటికే పనిపోయిందని తెలిపారు. అప్పటివరకు తమతో ఉన్న ఉపాధ్యాయురాలు ఒక్కక్షణంలో చనిపోవడాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయురాలు జీర్ణించుకోలేకపోతున్నారు. సునీతది మంచిర్యాల జిల్లాకేంద్రంలోని గౌతమేశ్వరకాలనీ. ఈమె భర్త కూడా అంతర్గాం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపరపల్లె గ్రామానికి చెందిన కాశవేని కొమురయ్య(50) మానసికస్థితి సరిగా లేక పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఎప్పటిలాగే బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లిన కొమురయ్య పొలం వద్ద పురుగులమందు తాగి పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే చికిత్సకోసం సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. కొమురయ్య భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా


ధ్వంసమైన కారు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాల వద్ద, రాజీవ్‌రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై ఉపేందర్‌రావు వివరాల ప్రకారం.. ఎన్టీపీసీకి చెందిన డ్రైవర్ శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, ఇందిరా, అయాన్స్ పనినిమిత్తం కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఎన్టీపీసీకి వస్తున్న క్రమంలో అదుపుతప్పి పక్కన ఉన్న సిమెంట్ దిమ్మలను ఢీకొట్టింది. కారు బోల్తాపడగా డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మిగితావారు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్సై వివరించారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టులు పెట్టిన యువకునిపై కేసు

చందుర్తి(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుపై ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టు పెట్టిన చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన మెకిలే విజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఇటీవల జరిగిన సెస్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేను కించపర్చేలా వీడియోను అప్‌లోడ్ చేశాడని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు.

బోధనోపకరణాలతో సత్ఫలితాలు


మండలస్థాయి మేళాలో ప్రదర్శనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు (ఫైల్)


టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శనలు

- బొమ్మల సహాయంతో పాఠాలు బోధిస్తున్న టీచర్లు
- 'తొలిమెట్టు'లో భాగంగా మండల స్థాయిలో ముగిసిన టీఎల్‌ఎం మేళాలు
- రేపు జిల్లాస్థాయిలో నిర్వహణ

మల్లాపూర్(కోరుట్ల): కాలానికనుగుణంగా విద్యాబోధన జరగాలి. మూస పద్ధతి వల్ల విద్యార్థులు సంపూర్ణ జ్ఞానం పొందలేకపోతున్నారు. సాధారణ ఉపన్యాస విధానంలో పాఠాలు చెబితే అంతంతమాత్రమే అర్థం చేసుకుంటారు. అదే బొమ్మల సహాయంతో బోధిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఈ క్రమంలో పిల్లలకు ఎలా చెబితే అర్థమవుతుందో ముందుగా తెలుసుకొని, ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధిస్తున్నారు. ఇందుకోసం బోధనోపకరణాలు ఉపయోగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇదే లక్ష్యంతో జగిత్యాల జిల్లాలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం చేపట్టింది. టీచర్లకు బోధనలో పోటీతత్వం పెరిగేలా విద్యాశాఖ టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాలను మండలస్థాయిలో నిర్వహించింది.

20 మండలాల్లో టీఎల్‌ఎం మేళాలు..

గత డిసెంబర్ చివరి వారంలో టీఎల్‌ఎం మేళాలు జిల్లాలోని 20 మండలాల్లో ముగిశాయి. జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాను ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మండలస్థాయిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఒక్కో టీచర్ మూడు నుంచి నాలుగు నమూనాలు తయారు చేసి, ప్రదర్శించారు. వాటిని ఎస్‌ఎంసీ సభ్యులు, నిర్వహించే ప్రాంతంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు సహా ప్రజాప్రతినిధులు, స్థానికులు వీక్షించారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, గణితం, పరిసరాల విజ్ఞాన శాస్త్రం(ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)లో రెండు చొప్పున ఎంపిక చేశారు. ప్రతీ మండలం నుంచి 8 నుంచి 10 వరకు నమూనాలు జిల్లాస్థాయిలో పోటీ పడనున్నాయి. ఈ లెక్కన 180 నుంచి 200 వరకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి పదింటిని ఎంపిక చేయనున్నారు. వాటిని తయారు చేసిన టీచర్లకు ప్రోత్సాహకంతోపాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. టీఎల్‌ఎం బోధన, అభ్యసన ప్రక్రియతో ప్రాథమిక తరగతుల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం మెరుగుపడనుంది.

జిల్లాలోని పాఠశాలల వివరాలు	
ప్రభుత్వ పాఠశాలలు	: 783
కస్తూరిబాలు	: 14
మోడల్ స్కూళ్లు	: 13
గురుకులాలు	: 25
విద్యార్థులు	: 85,368 మంది

విద్యార్థులకు ప్రయోజనకరం..



సాధారణ బోధన, బ్లాక్ బోర్డుపై బొమ్మలు గీసి, చెప్పే పాఠాల కన్నా బోధనోపకరణాలతో బోధించే పాఠాలు విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటాయి. అవి వారి మనసులో నిక్షిప్తమై ఉండటంతోపాటు సులువుగా అర్థం చేసుకుంటారు. బోధనోపకరణాలు తయారు చేయడంతోపాటు ఇతరులు ప్రదర్శించినవి చూడటం వల్ల టీచర్లు మరింత మెరుగ్గా పాఠాలు బోధించే అవకాశం ఉంటుంది.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

అనేక అంశాల్లో బోధనోపకరణాలు..

తెలుగులో వర్ణమాల, సరళ, సంయుక్త పదాలు, పదకేళి, భాషా భాగాలు, ఆంగ్లంలో వ్యాకరణం, పదాల కూర్పు, గణితంలో చతుర్విధ ప్రక్రియలు, పరిసరాల విజ్ఞానంలో మానవ శరీర భాగాలు, ఆరోగ్యం, పర్యావరణం ఇలా అనేక అంశాల్లో ఉపాధ్యాయులు బోధనోపకరణాలు రూపొందించారు. తొలిమెట్టులో కీలకమైన ఈ మేళాల ద్వారా చక్కటి మార్పు రానుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. కృత్యాధార బోధనపై టీచర్లు మరింతగా దృష్టి సారించనున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

- రూ.1.45 లక్షల సొత్తు స్వాధీనం


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ రమణమూర్తి

పెగడపల్లి(ధర్మపురి): వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.1.45 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్వేతతో కలిసి మల్యాల సీఐ రమణమూర్తి బుధవారం అరెస్టు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన దాసరి రాజు, ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన జాడి రాజేందర్ కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో చోరీలు చేస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 13న పెగడపల్లి మండలం బతికపల్లిలో దూస రమేశ్ ఇంటి తాళం పగులగొట్టి తులం బంగారు నగలు, 30 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. ఈనెల 3న మేడపల్లి మండలం గుమ్లాపూర్ కాలువ సమీపంలో పార్కు చేసిన హోండా షైన్ ద్విచక్ర వాహనం, ఈనెల 12న రామడుగు గ్రామ శివారులో నిలిపిఉన్న ఆటో నుంచి రెండు సెల్‌ఫోన్లను చోరీ చేశారు. పెగడపల్లిలో పోలీసులు బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన రాజు, రాజేందర్ అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ జరపగా దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి ద్విచక్ర వాహనంతోపాటు బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసులు ఛేదించిన సీఐ రమణమూర్తి, ఎస్సై శ్వేత, హెచ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది సంతోష్, ఎల్లయ్య, వెంకటేశ్, మహేశ్, ఉదయ్‌కుమార్, మనోహర్, రమాదేవి, హోంగార్డు రాజును ఎస్పీ సింధూశర్మ, డీఎస్పీ ప్రకాశ్ అభినందించారు.

జల్సాల కోసమే దొంగతనాలు

- ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు
- 12 గ్రాముల బంగారం, పల్సర్ బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): జల్సాల కోసం చైన్‌స్నాచింగ్‌లు, చోరీలు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తుర్కాసినగర్‌కు చెందిన షేక్ వలీ, మరో బాలుడు మంచి స్నేహితులు. ఇద్దరూ జల్సాలకు అలవాటు పడ్డారు. కష్టపడి పనిచేయడం ఇష్టం లేక.. సులభంగా డబ్బు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈక్రమంలో చైన్‌స్నాచింగ్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల12న పల్సర్ బైక్‌పై మొగిలిపేటలోని కిరాణానికి వెళ్తున్న వృద్ధురాలిపై దాడిచేసి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు తెంచుకు వెళ్లారు. అదేరోజు జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలోనూ చైన్‌స్నాచింగ్ చేశారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసుల బృందం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో బుధవారం కొత్తదాంరాజుపల్లిలో అపరిచితులు పల్సర్ బైక్‌పై తిరుగుతున్నారనే సమాచారంతో ఎస్సై నవీన్‌కుమార్, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. షేక్ వలీతోపాటు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ జరపగా చోరీలు, చైన్‌స్నాచింగ్ వివరాలు వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది చేసిన కృషిని డీఎస్పీ అభినందించారు. వీరికి రివార్డులు అందించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. నిందితుల నుంచి 12 గ్రాముల బంగారం, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన ఎల్లయ్య


చెట్టును ఢీకొని ఆగిపోయిన కారు

మానకొండూరు: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లికి చెందిన ఆరెల్లి ఎల్లయ్య బుధవారం ఖాదర్‌గూడెం శివారులో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి, ఢీకొట్టింది. అనంతరం చెట్టును ఢీకొని, ఆగిపోయింది. ప్రమాదంలో ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి, బాధితుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ న్యాయవాద విద్యార్థి మృతి


సాగర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగుండారం గ్రామానికి చెందిన జజ్జరి సాగర్ (28) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈసంఘటన స్వగ్రామంలో విషాదం నింపింది. గుండారం గ్రామానికి చెందిన జజ్జరి ప్రకాశ్–ఎల్లవ్వల కొడుకు సాగర్ హైదరాబాద్‌లో న్యాయవాద విద్యనభ్యసిస్తున్నాడు. పరీక్షలు రాసి ఇంటికొచ్చిన సాగర్ ఈనెల12న ఫలితాలు వెలువడడంతో తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడే రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సాగర్ ఉస్మానియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకుని ఇంటికొచ్చాడు. ఈనెల16న కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి శస్త్రచికిత్స చేస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతునికి తల్లిదండ్రులు ప్రకాష్, ఎల్లవ్వ, ఇద్దరు సోదరులున్నారు.

ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పెగడపల్లిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న హాత్ సే హాత్ అభియాన్ యాత్రలో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పాదయాత్ర చేయాలన్నారు. గడపగడపకూ వెళ్లి, ప్రభుత్వాల వైఫల్యాలను, గతంలో కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రాహుల్‌గాంధీ, వైఎస్సార్‌లను ఆదర్శంగా తీసుకొని కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోని తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. నాయకులు గజ్జల స్వామి, రాములుగౌడ్, మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, శంకర్, శోభారాణి, విష్ణు, రాజు, విజయభాస్కర్, రవి, సత్తిరెడ్డి, అనిల్‌గౌడ్, సంజీవ్, రాకేశ్‌యాదవ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి నీటిని రక్షించాలి

- ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేశ్
- ఎస్సారార్‌లో జాతీయ సెమినార్ ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ మల్లేశ్

శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్): ప్రాణకోటి మనుగడకు నీరే జీవనాధారమని, దాన్ని కాలుష్యం నుంచి రక్షించుకోవాలని ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేశ్ అన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో హైడ్రో బయాలజీలో అవకాశాలు–పరిశోధనలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. జీవపరిణామం, మానవ నాగరికత అంతా నదులు, సరస్సుల తీరాల వెంట విలసిల్లిందని తెలిపారు. భూమి మీద మూడొంతుల నీరు, ఒక భాగం భూమి ఉందని, నీటిపై పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఆచార్య లక్ష్మణ్, సెమినార్ కన్వీనర్ మహేశ్, పి.రాజు, సీహెచ్.తిరుపతి, బి.సురేష్‌కుమార్, ప్రొఫెసర్ వెంకయ్య, ప్రొఫెసర్ ఇస్తారి, డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ పి.ముత్తన్న, డాక్టర్ జి.కిశోర్ కుమార్, డాక్టర్ టి.శంకర్, సురేందర్‌రెడ్డి, సంజీవయ్య, వివిధ కళాశాలల అధ్యాపకులు, పీజీ, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం.. ఇక రుచికరం


పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచిన సర్కారు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2,03,004 మంది విద్యార్థులకు ప్రయోజనం

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి రుచికర భోజనం అందనుంది. ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరల కారణంగా వంట నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేకపోతున్నారు. రోజురోజుకూ రేట్లు అధికమవుతుండటంతో భోజనం తయారీపై వంట ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన సర్కారు ధరలు పెంచింది. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన సన్న బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, కోడిగుడ్లను మాత్రం వంట ఏజెన్సీల నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మెనూ ప్రకారం పాఠశాలలు పనిచేసే వారానికి ఆరు రోజుల్లో మూడు రోజులపాటు గుడ్డు ఇవ్వాల్సి ఉంటుంది. రోజు పప్పు, ఒక కూర తప్పనిసరిగా ఉండాలి. గుడ్డు ధర పెరగడం నిర్వాహకులకు భారంగా మారింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో మధ్యాహ్న భోజన పథకం పటిష్టం కానుంది. పోషకాలతో కూడిన రుచికర భోజనం విద్యార్థులకు అందనుంది.

అక్టోబర్ 2022 నుంచి అమలు..

మధ్యాహ్న భోజన పథకం ధరలు పెంచుతూ ఈ నెల 12న ఉత్తర్వులు జారీ అయినప్పటికీ 2022 అక్టోబర్ 1 నుంచి వాటిని అమలు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. వంట ఏజెన్సీలు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన బిల్లులు గతంలోనే సమర్పించినప్పటికీ.. పెంచిన ధరల ప్రకారం మళ్లీ అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 2,03,004 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థులు, కుకింగ్ కం హెల్పర్లు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	హెల్పర్లు
కరీంనగర్	662	49,754	1,134
జగిత్యాల	781	71,909	1,564
పెద్దపల్లి	545	38,428	1,123
రాజన్నసిరిసిల్ల	496	42,913	863

పెరిగిన ధరలు (ఒక్కో విద్యార్థికి రూ.లలో)...

తరగతి	గతంలో	ప్రస్తుతం
1–5	4.97	5.46
6–8	7.45	8.17
9–10	9.95	10.67

ఉత్తర్వులు అందాయి




ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా ధరలు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. వంట ఏజెన్సీలు మెనూ ప్రకారం భోజనం అందించాలి. ధరల పెంపుతో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందుతుంది. భోజనం తయారీలో నాణ్యతను నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

– సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

మేడిపెల్లి(జగిత్యాల): జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన దండికం మల్లయ్య(64) భార్య కొన్ని రోజుల క్రితం చనిపోయింది. దీంతో ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు కాగా ఇద్దరికీ వివాహాలయ్యాయి. కొడుకు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. మృతుడి కూతురు గడ్డి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

డబ్బుల వివాదం.. వ్యక్తి కిడ్నాప్


రాజయ్య

మెట్‌పల్లి(కోరుట్ల): డబ్బుల వివాదంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన మెట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కోట రాజయ్యకు అదే కాలనీకి చెందిన ద్యావనమైన ఎల్లమ్మ కుటుంబానికి మధ్య డబ్బుల విషయమై కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత మంగళవారం ఎల్లమ్మ.. సమ్మయ్య, కోట దుర్గయ్య, ఇస్తారిలతో కలిసి రాజయ్య ఇంటికి వెళ్లింది. అందరూ కలిసి రాజయ్య, అతని భార్య రామక్కలపై దాడి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేశారు. అనంతరం రాజయ్యను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించుకొని, వెళ్లిపోయారు. తన భర్తను ఎక్కడికో తీసుకుపోయారని రామక్క బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపు రాజన్న(65) ఈ నెల 15న ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. తుంగూర్‌లోని రైస్‌మిల్లు వద్దకు రాగానే కందెనకుంట గ్రామానికి చెందిన సిరిపెల్లి రమణ బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ వచ్చి, ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు?

చందుర్తి(వేములవాడ): చందుర్తి పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడి నుంచి బైక్ స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆర్సీని తీసుకురావాలని సూచించినట్లు తెలిసింది. వాహనాదారున్ని ఒరిజనల్ ఆర్సీ తీసుకొచ్చి బైక్ తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇటీవల చందుర్తి మండలకేంద్రానికి చెందిన ఓ యువకుని బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా.. సదరు యువకుడు పోలీసుల తీరును నిరసిస్తూ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు మండలంలో తిరుగుతున్న బైక్‌లపై దృష్టి పెట్టినట్లు తెలిసింది. తప్పుడు నంబర్లతో 20కి పైగా బైక్‌లు ఉన్నట్లు ప్రచారం కావడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.

ఐదుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కథలాపూర్(వేములవాడ): మండలంలో మద్యం సేవించి, వాహనాలు నడిపిన ఐదుగురిపై బుధవారం డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామచంద్రం తెలిపారు. వాహనాల తనిఖీ చేపడుతుండగా పలువురు మద్యం మత్తులో ఉన్నట్లు అనుమానం వచ్చిందన్నారు. బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేయగా ఐదుగురు మద్యం సేవించినట్లు తేలిందని పేర్కొన్నారు.